క్లుప్తంగా

మంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ



సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న మంత్రులు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ సర్పంచ్ అర్శనపల్లి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వినోద్‌కు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావు ప్రశంసాపత్రం, అవార్డు ప్రదానం చేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా రవీంద్ర భారతిలో ఐఎస్‌వో సర్టిఫికెట్ అందించారు.

పెద్దమ్మ తల్లి ఉత్సవాలు



బోనాలతో మహిళలు

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి బోనాలు, పట్నాలు శుక్రవారంతో ముగిశాయి. పట్నాలు, బోనాలు మహోత్సవంలో బీజేపీ నాయకులు ఏగోళపు సదయ్యగౌడ్ పాల్గొని పెద్దమ్మ తల్లికి పూజలు చేసి మొక్కులు సమర్పించారు. సభ్యులు ఈర్ల స్వామి, ఈర్ల పోచయ్య, రాజయ్య, ముత్యాల మహేందర్, సాగంటి రవి పాల్గొన్నారు.

జీపుజాత కార్యక్రమం విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జ్యోతి

పాలకుర్తి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలో నిర్వహించనున్న జీపుజాత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా కార్యదర్శి జ్యోతి పిలుపునిచ్చారు. పాలకుర్తి మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జీపుజాత పోస్టర్‌ను ఆవిష్కరించారు. జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు రూ.26వేల వేతనం చెల్లించాలని నిర్వహిస్తున్న జీపుజాత 18న పెద్దపల్లి జిల్లాకు చేరుకుంటుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, రాజేశ్వరి, నిర్మల, లక్ష్మి, భాగ్య, సరోజ పాల్గొన్నారు.

మంథనిలో అభివృద్ధి నామమాత్రమే



మాట్లాడుతున్న సదాశివ్

మంథని: మంథని మున్సిపాలిటీగా మారిన తర్వాత ఇక్కడ అభివృద్ధి నామమాత్రంగానే జరిగిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సదాశివ్ ఆరోపించారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్లాటర్ హౌస్ వద్ద పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేదని, మూడో వార్డులో అక్రమంగా గోవధశాల నిర్వహిస్తున్నారని ఆరోపించారు. నాయకులు బోగోజు శ్రీనివాస్, కోరబోయిన మల్లికార్జున్, బూడిద తిరుపతి, దాసరి లక్ష్మణ్ ఉన్నారు.

విద్యార్థినికి సన్మానం



నిత్యను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన బొజ్జ నిత్య పది పరీక్ష ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించింది. ఈ మేరకు శుక్రవారం మండల స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. మండల అధ్యక్షుడు సంగోజు చారి, బొజ్జ సంతోష్, సజ్జనపు సంపత్, బొజ్జ సాగర్, రవి పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ధర్మారం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో టీజీటీ ఆంగ్లం, టీజీటీ హిందీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మన్నె దీనా తెలిపారు. ఈ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు 19న ధ్రువపత్రాలతో విద్యాలయంలో నిర్వహించే డెమో క్లాసులకు హాజరుకావాలని పేర్కొన్నారు.

మట్టి అక్రమ రవాణాపై చర్యలేవి?

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన సభ్యులు



మాట్లాడుతున్న కోఆప్షన్ సభ్యుడు సర్వర్‌పాషా

పాలకుర్తి: బసంత్‌నగర్ విమానాశ్రయ ప్రతిపాదిత స్థలాల నుంచి నిత్యం మట్టి అక్రమంగా రవాణా జరుగుతోందని, ఇప్పటికే కొన్నివేల ట్రిప్పుల మట్టి రవాణా జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మండల కోఆప్షన్ సభ్యుడు సర్వర్‌పాషా మండల తహసీల్దార్ సునీతను ప్రశ్నించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం పూర్తిస్థాయిలో కోరం లేని కారణంగా గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. జీడీనగర్‌లో సర్వే నెంబర్ 561లో, ధర్మారం క్రాస్‌రోడ్డు వద్ద సర్వేనెంబర్ 504లో అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండల కోఆప్షన్ సభ్యుడు సర్వర్‌పాషా తహసీల్దార్‌ను ప్రశ్నించారు. కేశోరాం ఆధీనంలో ఉన్న భూముల లీజును రద్దు చేయాలని పాలకుర్తి ఎంపీటీసీ దుర్గం కుమార్ కోరారు. మిషన్ భగీరథ ఏఈ కోర్నల్ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 18న జరగనున్న జల దినోత్సవాన్ని అన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల్లో ఇంకా భగీరథ పనులు పూర్తికాలేదని, జలదినోత్సవం ఎలా నిర్వహించాలని మారేడుపల్లి సర్పంచ్ గంధం లక్ష్మీనారాయణ ఏఈని ప్రశ్నించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మల్లెత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయిందని, పాఠశాలలు మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయని, దీనిపై అధికారులు దృష్టిసారించాలని కోరారు. విద్యుత్ లూప్‌లైన్ల మూలంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మిడిల్ పోల్స్ నిర్మించాలని ట్రాన్స్‌కో ఏఈ వంశీకృష్ణను కోరారు. పాలకుర్తిలో మహిళా స్వశక్తి సంఘానికి సంబంధించిన రూ.12లక్షలు కాజేసిన వ్యక్తులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎంపీటీసీ కుమార్ ఐకేపీ ఏపీఎం సదానందంను ప్రశ్నించారు. మండలానికి సాగునీరు అందించే 1ఎల్ కాలువకు చాలా చోట్ల గండ్లు పడి నీరంతా వృథాగా పోతోందని, అధికారులు వాటిని పూడ్చి రైతులకు సక్రమంగా నీరు అందేలా చర్యలు చేపట్టాలని వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి కోరారు. స్థానికంగా విమానాశ్రయం ఏర్పాటయ్యే అవకాశాలు లేనందున విమానాశ్రయ ప్రతిపాదిత స్థలం నుంచి మండల నూతన కార్యాలయాల భవన నిర్మాణాలకు కావాల్సిన భూమిని కేటాయించాలని కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య, వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, ఎంపీడీవో లలిత, తహసీల్దార్ సునీత, ఎంపీవో షబ్బీర్ పాషా, వ్యవసాయాధికారి ప్రకాష్, ట్రాన్స్‌కో ఏఈ వంశీకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, పశువైద్యురాలు కల్యాణి, ఐకేపీ ఏపీఎం సదానందం, హార్టికల్చర్ అధికారి శ్రీకాంత్, ఉపాధిహామీ ఏపీఎం రమేశ్, సర్పంచ్‌లు మల్లెత్తుల శ్రీనివాస్, దుర్గం జగన్, గంధం లక్ష్మీనారాయణ, ఆడెపు శ్రీనివాస్, ఎంపీటీసీలు బండారి శ్రీవాణి, అతిఖ్, దుర్గం కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం.. పాలకుల నిర్లక్ష్యం

పాలకుర్తి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించేందుకు వేదిక మండల సర్వసభ్య సమావేశం. కానీ ఇది పాలకులకు పరిహాసంగా మారుతోంది. మూడునెలలకు ఒకసారి జరిగే మండల స్థాయి సమావేశానికి ప్రజాప్రతినిధులెవరూ సకాలంలో హాజరుకావడం లేదు. దీంతో ఎంపీడీవోతో పాటు కార్యాలయ సిబ్బంది పూర్తిస్థాయి కోరం కోసం ఎంపీటీసీను ఫోన్లో బతిమిలాడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. మండల కేంద్రంలో నిర్వహించే ప్రతి మండల సర్వసభ్య సమావేశంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంటున్నది. మండలవ్యాప్తంగా 19 పంచాయతీలకు గాను 19 మంది సర్పంచ్‌లు, 9 మంది ఎంపీటీసీలు ఉండగా గడిచిన నాలుగేళ్లలో ఏ ఒక్క సమావేశానికి కూడా పూర్తిస్థాయిలో సభ్యులెవరూ హాజరు కాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కాదు. కేవలం సింగిల్ డిజిట్ సభ్యులు మాత్రమే హాజరు కావడం అదికూడా అధికారుల అభ్యర్థన మేరకే కావడం గమనార్హం. కాగా శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి కూడా కేవలం ఐదుగురు ఎంపీటీసీలు, నలుగురు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను అధికారులు సకాలంలో పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. దీంతో నైరాశ్యం చెందుతున్న ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేందుకు ఆసక్తి చూపడం లేదని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరునెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఆసుపత్రి కాంట్రాక్టు కార్మిక సంఘం కార్యదర్శి బుద్దుల రమేశ్ డిమాండ్ చేశారు. జిల్లా ఆసుపత్రి ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. తమకు బకాయి ఉన్న వేతనాలను కాంట్రాక్టర్ నుంచి ఇప్పించేలా చూడాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ శౌరయ్య దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాకేశ్, రాజు, సతీశ్, శ్రీనివాస్, నాగేందర్, పద్మ, ఉమ, ఫాతిమా, కల్యాణి, స్వప్న, స్వరూప పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఎక్కడ చూసినా సమస్యలే



ఓదెలలో స్థానికులతో మాట్లాడుతున్న ఉష

ఓదెల: ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని, నియోజకవర్గంలో ఎక్కడ చూసినా సమస్యలే కనిపిస్తున్నాయని అన్నారు. బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. ఓదెల గ్రామంలో మన ఊరు మన ఉష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రంలో బహుజనులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. రానున్నది బహుజనుల రాజ్యమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దాసరి హన్మయ్య, కోశాధికారి ఎండీ రియాజ్, అసెంబ్లీ మహిళా కన్వీనర్ ఆముదాల అరుణ, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి మండల అధ్యక్షులు కుమ్మరికుంట రవికుమార్, సీపెల్లి కొముర‌య్య, మండల కమిటీ నాయకులు కల్యాణ మహేశ్, కాసర్ల శ్రీనివాస్, ఎండీ వాహిద్, జిల్లా కన్వీనర్ మచ్చ రాహుల్ పాల్గొన్నారు.

పసికందు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని మాతాశిశు ఆరోగ్యకేంద్రంలో గురువారం పసికందు మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పసికందు మరణంపై ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ఇకమీదట ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. నాయకులు చంద్రశేఖర్, రియాజ్, అరుణ, సాధిక్, శ్రావణ్‌కుమార్, సిద్ధిఖ్ ఉన్నారు.

ఆరెకటిక కమ్యూనిటీ హాల్ నిర్మించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ఆరెకటిక సంఘానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణంతోపాటు బోర్‌వెల్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేస్తున్నట్లు గతంలోనే ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, కానీ ఇప్పటికీ నిధుల మంజూరు, బోర్‌వెల్ నిర్మాణం తదితర పనులు ప్రారంభానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు. ఆరెకటిక సంఘం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా అధ్యక్షుడు గౌళికార్ రాముజీ, ప్రధాన కార్యదర్శి గజభీంకర్ నర్సోజీ, కోశాధికారి కోయల్‌కార్ చందు, సంఘం నాయకులు మహేశ్, రాజన్న, అనిల్, సతీశ్, సాయి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్, కాలనీవాసులు

కోల్‌సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని 11వ డివిజన్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వి డిమాండ్ చేశారు. ఈ మేరకు డివిజన్ మహిళలతో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయంలోని డిప్యూటీ కమిషనర్ నారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన డిప్యూటీ కమిషనర్ సమస్యను నగర మేయర్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

పార్టీని వార్డుస్థాయిలో పటిష్ట పరుస్తాం



సన్మానిస్తున్న పట్టణ నాయకులు

సుల్తానాబాద్: బీజేపీ పార్టీని వార్డు స్థాయిలో పటిష్ట పరిచి రానున్న ఎన్నికల్లో సత్తా చాటుతామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు యాదవ్ అన్నారు. పట్టణ అధ్యక్షుడిగా నియామకమైన సందర్భంగా పలువురు ఆయనను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఓబీసీ మండల అధ్యక్షుడు చిట్టవేణి సదయ్య, బీజేపీ నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్, అన్వేష్, శంకరయ్య, కొమురయ్య, రవీందర్, వీరగోని కిరణ్‌గౌడ్, తిరుపతిచారి, జెట్టి రాజు యాదవ్, సతీశ్‌గౌడ్, శ్రీకాంత్, మహేశ్‌పటేల్, పవన్, మహేశ్, ప్రశాంత్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: జిల్లా రైస్‌మిల్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మోరపల్లి తిరుపతిరెడ్డిని వివిధ పార్టీల నాయకులు శుక్రవారం సుల్తానాబాద్‌లో కలిసి ఘనంగా సన్మానించారు. ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌నాయకులు కావేటి శ్రీరాములుయాదవ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్ ఉన్నారు.

మంచినీళ్ల పండుగ విజయవంతం చేయాలి

ఓదెల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆది, సోమవారాల్లో జరిగే మంచినీళ్ల పండుగ, హరితహారం కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో జి.సత్తయ్య కోరారు. ఊరూరా హరితహారం విజయవంతంలో భాగంగా ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అదేవిధంగా సోమవారం మంచినీళ్ల పండుగలో భాగంగా భగీరథ నీటిని ఇంటింటా నల్లాల ద్వారా ప్రారంభించాలన్నారు. ఎంపీవో వాజీద్, ఏపీవో రమేశ్, సూపరింటెండెంట్ శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామగుండం: రామగుండం సబ్‌స్టేషన్‌లో పునరుద్ధరణ పనుల నిమిత్తం దాని పరిధిలో ఉన్న ప్రాంతాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బేతి దామోదర్‌రావు తెలిపారు. మల్యాలపల్లి, బద్రిపల్లి, మొగల్‌పహాడ్, కుందనపల్లి, అక్బర్‌నగర్, రైల్వేస్టేషన్ ఏరియా, విద్యుత్‌నగర్, అయోధ్యనగర్, జీరోపాయింట్, హౌజింగ్‌బోర్డు కాలనీ, లింగాపూర్, అబాది రామగుండం, సండే మార్కెట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని పేర్కొన్నారు.

బల్దియా ఎదుట టీఎల్‌పీ నిరసన



నిరసన తెలుపుతున్న టీఎల్పీ నాయకులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం బల్దియా ఎదుట శుక్రవారం తెలంగాణ లేబర్ పార్టీ(టీఎల్‌పీ) ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రాజయ్య మాట్లాడారు. రామగుండంలో నిర్వహిస్తున్నది పట్టణ ప్రగతి దినోత్సవం కాదని, తెలంగాణ అభివృద్ధి నిరోధక దినోత్సవం అని ఎద్దేవా చేశారు. కార్పొరేషన్‌లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 30వ డివిజన్‌లో కల్వర్టు తెగిపోయి రోజులు గడుస్తున్నా పాలకులు, అధికారులు నిర్మాణం చేపట్టలేదన్నారు. డంపింగ్‌యార్డ్‌కు సొంత స్థలం కేటాయించలేని దుస్థితిలో ఉన్నారని ఆరోపించారు. వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గొర్రె లక్ష్మి, అల్లప్ప తిరుపతి, జక్కం కవిత, అఖిల్ వర్మ, వెంకటేష్, భానుచందర్, మోహన్‌రెడ్డి కనకలక్ష్మి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మోహన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పరామర్శించారు. రొంపికుంటకు చెందిన పలువురు మృతి చెందగా మృతుల కుటుంబాలను పరామర్శించారు. మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు, సర్పంచ్‌లు కట్కం రవీందర్, ఆకుల ఓదెలు, ఉపసర్పంచ్ గుమ్మడి సతీశ్, మాజీ సర్పంచ్ కుందారపు బాపు, తిరుపతి, ముస్తాక్ ఉన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

ఓదెల: మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని పొత్కపల్లి ఎస్సై రామకృష్ణ అన్నారు. మండలంలోని పొత్కపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలు, నకిలీ విత్తనాల రవాణా లాంటి చర్యలకు పాల్పడితే వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. యువత చెడు అలవాట్లకు దూరం ఉండాలని, ఎవరైనా మత్తుకు అలవాటు పడితే ఉపాధ్యాయులు, స్నేహితులు ప్రాథమిక దశలోనే గుర్తించి వాటికి దూరంగా ఉండేలా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆళ్ల రాజిరెడ్డి, ఉపసర్పంచు వంగల శ్రీనివాస్, వార్డుసభ్యులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ గుడికి విరాళం



విరాళం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యుడు

యైటింక్లయిన్‌కాలనీ: కేవీఎస్ ఫ్రెండ్లీ ఫౌండేషన్ చైర్మన్ కుకునూర్ వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు రామగిరి మండలం చందనాపూర్ గ్రామంలో సేవా సంస్థ అధ్యక్షుడు ఎండీ ఫయాజ్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ గుడికి రూ.10వేల విరాళం గౌడ కులస్తులకు అందజేశారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన రాజమల్లు పటేల్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ స్పందించి అంత్యక్రియల కోసం రూ.5వేలు సేవాదళం సభ్యులతో మృతుని కుటుంబానికి అందించారు. పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు సబ్బని రాజమల్లు, గ్రామ అధ్యక్షుడు గోలి సుధాకర్, మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు శంకర్, సేవాదళం సభ్యులు కుమార్, బిక్షపతి, సంతోష్, కొంతం మల్లయ్య ఉన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో అన్నీ మాటల గారడీలే




మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మహేశ్

రామగుండం: గ్రామాల్లో దశాబ్ది ఉత్సవాల పేరుతో నిర్వహించే కార్యక్రమాల్లో ప్రభుత్వం మాటల గారడీలు, గొర్రెలు, బర్రెల పంపిణీతో ప్రజలను పక్కదారి పట్టించే చర్యలు తప్పా.. ఎలాంటి అభివృద్ధి లేదని, రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తవుతున్నా పదేళ్ల ఉత్సవాలు నిర్వహించడం బీఆర్‌ఎస్ పార్టీ అవివేకమని కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ ఆరోపించారు. ఈమేరకు శుక్రవారం గోలివాడలో సమావేశం నిర్వహించారు. ముర్మూర్‌లో గురువారం నిర్వహించిన పల్లె ప్రగతి వేడుకల్లో ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితులు ఎమ్మెల్యేను కలిసి తమకు న్యాయం చేయాలని కోరగా ఎమ్మెల్యే బెదిరింపు చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. పల్లెప్రగతి పేరుతో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించడం లేదని ఆరోపించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు అఖిలపక్షం ఏర్పాటు చేసి కాలయాపన చేస్తున్నారన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరించకుంటే ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. కాంగ్రెస్ అంతర్గాం మండల ఇన్‌చార్జి పెండ్రు హన్మాన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, గుంటబాపు, మడ్డి తిరుపతిగౌడ్, బర్పటి శ్రీనివాస్, ఎనగందుల శ్రీకాంత్, శేఖర్, చందు పాల్గొన్నారు.

విద్యా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

సుల్తానాబాద్: ఈనెల 20న విద్యాదినోత్సవాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు జయప్రదం చేయాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి లేఖలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు దుస్తులు, బుక్స్, నోటుబుక్స్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థుల ఫలితాలు, క్వాలిఫై టీచర్లతో విద్యాబోధన, చేయించడంతోపాటు మూడు నెలలకోసారి ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని మంత్రి లేఖలో పేర్కొన్నారు.

పదోవార్డు ప్రజలకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న పదో వార్డు ప్రజలు

సుల్తానాబాద్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పట్టణప్రగతి కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి పదో వార్డు ప్రజలకు కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నాలుగు ప్రశంసాపత్రాలు అందజేశారు. వ్యర్థ పదార్థాలతో ఎరువు తయారుచేసి చెట్లకు వేయడం, తడి, పొడి చెత్త వేరు చేయుట, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచిన ఎలిగేటి లక్ష్మి, ఎల్ల రేష్మ, చిలుమోజు వీరాచారి, స్వర్ణలతను గుర్తించి ప్రశంసాపత్రాలు అందజేశారు.